గంజాయి మరక తొలగేనా..?

● టాస్క్‌ఫోర్స్ చర్యలతో పెరుగుతున్న ఆశలు





మాదక ద్రవ్యాల విషయంలో రాష్ట్రప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండడంతో జిల్లాకు అంటుకున్న గంజాయి మరక తొలగిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో చిత్తూరు జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు జోరుగా సాగిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు రవాణాదారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు.

చిత్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనా కాలంలో గంజాయి రవాణాతో పాటు వాడకం కూడా జిల్లాలో విపరీతంగా పెరిగిపోయింది. 2014-19 మధ్యకాలంలో టీడీపీ, 2019-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. టీడీపీ హయాంలోని ఐదేళ్లలో 17 కేసులు నమోదు చేసి 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 45 మందిని అరెస్టు చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో ఏకంగా 169 కేసులు నమోదు చేసి 496 మందిని అరెస్టు చేసి 1166 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంటే సుమారు 20 రెట్లు అధికంగా గంజాయి పట్టుబడింది. ఒక్క మాటలో చెప్పాలంటే గత ఐదేళ్లలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. వైసీపీ నేతల అండతో గంజాయిని బెంగళూరు, చెన్నై నగరాలకు చిత్తూరు జిల్లా మీదుగా తరలించేవారు. నిత్యం చిత్తూరు జిల్లా పోలీసులు దాడులు చేసి కిలోల్లో గంజాయిని స్వాధీనం చేసుకునేవారు. కేసులు నమోదు చేసి అరెస్టులు చేసేవారు.జిల్లా మీదుగా గంజాయి సరఫరా అవుతున్న విషయాన్ని పక్కన పెడితే, జిల్లావాసులు పెద్దఎత్తున గంజాయి వాడుతున్నారనే విషయం ఆందోళనకు గురి చేసింది. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు వంటి పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గంగవరం, పెద్దపంజాణి, కుప్పం, రామకుప్పం వంటి గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి సరఫరా, వాడకం ఎక్కువగా ఉండేది. కుప్పం, రామకుప్పం, వి.కోట వంటి ప్రాంతాల్లో గంజాయిని సాగు కూడా చేసేవారంటే పరిస్థితి ఎంతగా విషమించిందో అర్థం చేసుకోవచ్చు.

● టాస్క్‌ఫోర్స్‌తో అరికట్టే ప్రయత్నం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంజాయిపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే మూడు నెలల కిందట ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో పనిచేసేలా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులోని పోలీసులు సివిల్ డ్రస్సుల్లో బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. గంజాయి సరఫరాతో పాటు తాగేవారిపైనా నిఘా ఉంచారు. రైల్వే స్టేషన్లు, బస్టాండుల్లో తనిఖీలు చేస్తున్నారు.అటవీ శాఖ అధికారుల సమన్వయంతో వి.కోట, రామకుప్పం ప్రాంతాల్లో సాగులో ఉన్న ఐదు గంజాయి చెట్లను గుర్తించారు.

టీడీపీ హయాంలో (2014-19) గంజాయి కేసులు

సంవత్సరం	కేసులు	అరెస్టు	పట్టుబడింది
2014	2	9మంది	18.50కిలోలు
2015	1	3	3
2016	3	5	9
2017	4	11	8.3
2018	7	17	24.91
మొత్తం	17	45	62.71

2024 జూన్ నుంచి

సంవత్సరం	కేసులు	అరెస్టు	పట్టుబడింది
2024	13	22	99.50కిలోలు

వైసీపీ హయాంలో (2019-24) గంజాయి కేసులు

సంవత్సరం	కేసులు	అరెస్టు	పట్టుబడింది
2019	6	12	92కిలోలు
2020	23	72	283
2021	37	124	250
2022	25	79	123.50
2023	47	132	254.50
2024 (మే వరకు)	31	77	163
మొత్తం	169	496	1166



నేరుగా జైలుకే

గంజాయిని అరికట్టేందుకు తీవ్ర కృషి చేస్తున్నాం. ఈమధ్య పుంగనూరులో ఒడిశావాసుల నుంచి 59 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం.వారికి ఆశ్రయం కల్పించిన స్థానికుల్ని కూడా అరెస్టు చేశాం. జూలై 16 నుంచీ వాళ్లు జైల్లోనే ఉన్నారు. గంజాయి సరఫరాతో పాటు దాన్ని తీసుకునేవారూ శిక్షార్హులే. టాస్క్‌ఫోర్స్ టీమ్ చాలా బలంగా పనిచేస్తోంది. దొరికితే నేరుగా జైలుకే పంపిస్తున్నాం.

-ఎస్పీ మణికంఠ

పుంగనూరులో విచ్చలవిడి విక్రయాలు

పుంగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో వున్న పుంగనూరులో గంజాయి సహా మత్తుపదార్థాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పూర్వం వృద్ధులు,బిచ్చగాళ్లకే పరిమితమైన గంజాయి సేవనం విద్యార్థులు, ఉద్యోగుల వరకు విస్తరించింది.సిగరెట్లలో పొగాకును తొలగించి గంజాయిని చేర్చి దర్జాగా బహిరంగ ప్రాంతాల్లో కూడా తాగుతున్నారు.కొన్ని విద్యాసంస్థల్లో గంజాయి మత్తులో ఉన్మాదుల్లా తయారైన విద్యార్థులు గొడవలు పడి హత్యలకు దారితీసిన సంఘటనలు కూడా ఉన్నాయి. పుంగనూరులో నక్కబండకు చెందిన ఓ యువకుడు చెరువు వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా స్థానికులు గమనించి మంటలు ఆర్పి రక్షించారు.తిరుపతి జిల్లాలోని మైపాడు బీచ్‌లో పుంగనూరుకు చెందిన ఓ యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పుంగనూరు గంగజాతరలో గొడవపడి ఓ విద్యార్థిని స్క్రూడ్రైవర్‌తో పొడిచి తీవ్రగాయాలకు గురిచేశారు.తాటిమాకులపాళ్యంలో స్నేహితులైన యువకులే పలుమార్లు గంజాయి మత్తులో గొడవ పడి దారుణంగా కొట్టుకున్నారు.పుంగనూరులో గంజాయి మత్తుకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుని పిచ్చివారిలా కొందరు బస్టాండులో తిరుగుతున్నారు.గొడవ, హత్య, అత్యాచారం, కిడ్నాప్ లాంటి నేరాలు జరిగితే వెంటనే గంజాయి మూలానే అనేది ప్రజల్లో వస్తున్న అనుమానం.

గంజాయి వ్యాపారులకు వైసీపీ నేతల మద్దతు

ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి పుంగనూరుకు రవాణా అవుతున్న గంజాయి ఇక్కడినుంచి బెంగళూరు, తమిళనాడు, పలమనేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, చిత్తూరు, కుప్పం ప్రాంతాలకు చేరుతోంది.కొంతమంది వైసీపీ నాయకులు గంజాయి స్మగ్లర్లకు మద్దతు ఇవ్వడంతో పాటు ఎక్సైజ్, సివిల్ పోలీసులను కంట్రోల్ చేశారనే విమర్శలున్నాయి.భారీఎత్తున గంజాయి పుంగనూరుకు వస్తున్నా గతంలో పోలీసు అధికారులు భారీగా మామూళ్లు తీసుకుని చూసిచూడనట్లు వ్యవహరించడంతో గంజాయి జాడ్యం విస్తరించింది. ఈనెల 6వ తేది పుంగనూరుకు వచ్చిన మంత్రులు అనిత, రాం ప్రసాద్‌రెడ్డి, ఫారూఖ్‌లకు గంజాయిని అరికట్టాలని స్థానికులు కోరారు.గంజాయి మత్తులో గొడవలు జరుగుతున్నాయని, యువత, విద్యార్థులు గంజాయికి బానిసలై అనేక అఘాయిత్యాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వుందని, మాదకద్రవ్యాల స్మగ్లింగుకు, అమ్మకాలకు సంబంధించి ఎంతటివారైనా వదిలిపెట్టబోమని మంత్రులు హామీ ఇచ్చారు.

ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతాలనుంచి రవాణా

గంజాయి ప్రధానంగా ఒడిశా రాష్ట్రంతో పాటు, ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో రవాణా అవుతోంది. గంజాయి అమ్మకాలు, రవాణాలో సులభంగా డబ్బు సంపాదించే అవకాశముండడంతో గంజాయికి బానిసైన యువత పాల్గొంటోంది.ఆరోగ్యపరంగా దెబ్బతినడంతో పాటు పోలీసులకు పట్టుబడిన పలువురు జైళ్లలో మగ్గుతున్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులు జైలు జీవితంలో పరిచయాలు పెంచుకుని విడుదల కాగానే ముఠాగా తయారై కార్యకలాపాలు ముమ్మరం చేస్తున్నారు.

తుఫాన్ తీరం దాటినా
వర్షం తప్పింది

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క అధికారుల హడావుడి. మరో పక్క వాతావరణశాఖ హెచ్చరికలు. పులికాట్ సరస్సు మీదుగా తుఫాను తీరం దాటుతోందంటే జనంలోనూ ఎక్కడో భయం. ఈ రాత్రికి ఏమవుతుందోనన్న ఆందోళన.. తీరా చూస్తే అమ్మోతుఫాన్ అనుకున్నది కాస్త తుస్సు తుఫాన్‌గా మారిపోయింది. బుధవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల లోపు సూళ్లూరుపేట, చెన్నై మధ్య తీరం దాటుతుందని అంచనావేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట, తడ మండలాలు అప్రమత్తంగా ఉండాలని తీవ్రమైన ప్రభావం ఈ మండలాలపై ఉంటుందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ హడావుడి హెచ్చరికలతో ఈ రెండు మండలాలలోని ప్రజలలో కొంత ఆందోళన కన్పించింది. తీరా చూస్తే బుధవారం ఉదయానికి తుఫాన్ తీరందాటిందా అన్న అనుమానం ప్రజల్లో కలిగింది. ఎందుకంటే అసలు తుఫాన్ తీరందాటిన దాఖలాలే ఈ మండలాల్లో కనిపించలేదు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తడ మండలంలో సుమారు 22 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ తీరందాటిందని అధికారులు చెప్పారు. అయితే తీరందాటే సమయంలో.. దాటిన తరువాత ఒక్క చినుకు కూడా పడలేదు. గురువారం ఉదయం నుంచి ఎండకాసింది. ఇంత పెద్ద తుఫాన్ ఎటువంటి ప్రభావం చూపకుండానే వెళ్లిపోయింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని కొందరు పెద్దలు వ్యాఖ్యానించారు. కాగా, ఈ తుఫాన్ ప్రభావంతో ఐదు రోజుల్లో తడ మండలంలో 278.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సూళ్లూరుపేట మండలంలో 378.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత వర్షం కురిసినా చెరువులు, గుంటలు పాతికశాతంకూడా నిండకపోవడం విశేషం.

తెరపిచ్చిన వాన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వాన గురువారం తెరపిచ్చింది. ఉదయాన్నే ఎండ కాయడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న ముసురు వానలతో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. గడిచిన 24 గంటల్లో మూడు మండలాలు మినహా 29 మండలాల్లో వర్షపాతం నమోదయ్యింది. రొంపిచెర్లలో అత్యధికంగా 39.2మి.మీ, గుడిపాలలో అత్యల్పంగా 1.0 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా కార్వేటినగరంలో 29.8మి.మీ, పాలసముద్రంలో 28, సోమలలో 27, నింద్రలో 24.4, వెదురుకుప్పంలో 23.2, పెద్దపంజాణిలో 22.2, పెనుమూరులో 21, పులిచెర్లలో 20.8, నగరిలో 19.4, చౌడేపల్లిలో 19.2, పూతలపట్టులో 19, శ్రీరంగరాజపురంలో 18.2, సదుంలో 17.4, పుంగనూరులో 15.6, ఐరాలలో 14.6, విజయపురంలో 13, పలమనేరులో 6, గంగాధరనెల్లూరులో 5.6, గంగవరంలో 5.4, బంగారుపాళ్యంలో 5.2, బైరెడ్డిపల్లిలో 3.2, కుప్పంలో 3.2, తవణంపల్లెలో 2.2, యాదమరిలో 1.4, వి.కోటలో 1.2, గుడుపల్లెలో 1.2, చిత్తూరులో ఒక మి.మీ వర్షం కురిసింది.



వాన కురవాల్సిన వేళ..

గురువారం ఉదయం సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ చెంగాళమ్మ ఆర్చి వద్ద..



జాతీయ రహదారిపై మంచుకురుస్తుండడంతో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

తిరుపతి జిల్లాలోని పులికాట్ సరస్సుమీదుగా తుఫాను తీరం దాటింది. ఆ ప్రభావంతో వాన కురుస్తుందనుకుంటే.. మంచుకురిసింది. సూళ్లూరుపేట, తడలో గురువారం తెల్లవారుజామున మంచుదుప్పటి కప్పుకుంది. ఉదయం 6 గంటల సమయంలోనూ దారి కనబడనంతగా మంచు కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించారు .

- తడ, ఆంధ్రజ్యోతి

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న కత్తులు - నిందితులతో డీఎస్పీ సాయినాథ్, సీఐ కంఠయ్య తదితరులు



చిత్తూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.డీఎస్పీ సాయినాథ్,సీఐ నెట్టి కంఠయ్య, ఎస్ఐ ప్రసాద్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఇరువారం ఏరియాలో గంజాయి అమ్మకాల గురించి బుధవారం సమాచారం అందింది. దీంతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది వెంటనే ఇరువారం ఏరియాలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ వెనుకవైపు దాడులు చేశారు. ఇరువారానికి చెందిన సెల్వం ఆలియాస్ జపోట్(33), పీహెచ్‌కాలనీకి చెందిన లోకేష్(25), సంతపేట బండ్లవీధికి చెందిన జామవా(24)లను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 2.42 లక్షల విలువ చేసే 1.6 కేజీల గంజాయి, రెండు ఆటోలు, ఒక ద్విచక్రవాహనం, కత్తులను స్వాధీనం చేసుకున్నారు.నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన అల్లాబక్ష్, వైఎస్ కాలనీకి చెందిన సిద్దు వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి చిత్తూరుకు గంజాయి తీసుకొస్తారని, వారి నుంచి మోహన్, సురేష్, తులసి తీసుకుని తమకు అమ్ముతారని విచారణలో వెల్లడించారు. గంజాయిని విక్రయించే క్రమంలో ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేసినా, పోలీసులకు సమాచారం ఇచ్చినా వారిపై దాడి చేయడానికి పెద్ద కత్తులను దగ్గర ఉంచుకున్నట్లు అంగీకరించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.అల్లాబక్ష్, సిద్దు, మోహన్, సురేష్, తులసీల కోసం గాలిస్తున్నారు.

95మద్యం దుకాణాలు ప్రారంభం

● తక్కువ ధరకే మద్యం అందుబాటులోకి

చిత్తూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవడంతో తక్కువ ధరలకే మద్యం అందుబాటులోకి వచ్చింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్టర్ బాటిల్ రూ.200 వరకు వుండేది. దీంతో చాలా మంది గంజాయి, సారా ఇతర మత్తు పదార్థాల వైపు మొగ్గుచూపేవారు.ప్రస్తుతం ఉదాహరణకు క్వార్టర్ బాటిల్ (ట్రోపికానా వీఎస్ఓపీ బ్రాంది) రూ.99కే అందుబాటులోకి వచ్చింది.జిల్లాలోని 104 మద్యం దుకాణాల్లో గురువారం నాటికి 95 ప్రారంభమయ్యాయి.కొంతమందికి అనువైన దుకాణాలు దొరక్కపోవడం, మంచి ముహూర్తాలు లేకపోవడం, ఒప్పందాలు కుదరకపోవడంతో మిగిలిన దుకాణాలు ప్రారంభం కాలేదు. కొంతమంది మద్యం దుకాణాలు ప్రారంభించిన తొలిరోజే స్టాక్ మొత్తం అమ్ముకుని రెండోసారి మద్యం కొనుగోలుకు డిపోలకు వెళ్లారు.

నేడు సఫాయి కర్మచారి చైర్మన్ పర్యటన

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ శుక్రవారం జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు చిత్తూరుకు చేరుకుని కలెక్టర్, ఎస్పీలతో కలిసి పారిశుధ్య కార్మికుల కాలనీల్లో పర్యటిస్తారన్నారు. 3.30 గంటలకు పారిశుధ్య కార్మికులకు అందుతున్న సంక్షేమకార్యక్రమాల అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో కమిషనర్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డీన్, కార్మికశాఖ అధికారి, తదితరులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. రాత్రి ఏడు గంటలకు తిరుపతికి బయల్దేరి వెళతారని కలెక్టర్ వివరించారు.

68 పంచాయతీల్లో పల్లె పండుగ

● రూ.10.33 కోట్లతో 172 పనులు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 68 గ్రామ పంచాయతీల్లో గురువారం పల్లె పండుగ నిర్వహించారు. రూ.10.33 కోట్లతో 172 పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లె మండలం టి.పుత్తూరు, కొండ్రాజుకాల్వ, ఈచనేరి, గురువారిపల్లె గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాల్గొని సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం పంద్యాలమడుగు, ఎస్.గొల్లపల్లెలో పంచాయతీలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. విజయపురం మండలం కోసలనగరం పంచాయతీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని రూ.12లక్షల విలువైన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. తొలి రోజు నుంచి ఇప్పటి వరకు రూ.26.12 కోట్లతో 498 పనులు చేపట్టారు.

స్విమ్స్‌లో మహిళలకు రాయితీపై మామోగ్రామ్ పరీక్షలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు మహిళలకు ప్రత్యేక రాయితీతో మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు రొమ్ము, అండాశయ క్యాన్సర్‌కు సంబంధించి ఈ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.రూ.వెయ్యికే డాక్టర్ కన్సల్టేషన్, మామోగ్రామ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్పెషల్ క్లినిక్‌గా పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 83339 97968 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెస్సీ కోర్సులకు రేపు,ఎల్లుండి స్పాట్ అడ్మిషన్స్

స్విమ్స్ వర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు 19, 20 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ తెలిపారు.బయో టెక్నాలజీలో ఒకటి, బయో ఇన్ఫర్మేటిక్స్‌లో 5 సీట్లున్నాయని వెల్లడించారు. ఏపీ పీజీ సెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ర్యాంక్ కార్డు, ఫీజుతో కేటాయించిన తేదీల్లో హాజరుకావాలని కోరారు.

బియ్యం కార్డుపై సన్‌ఫ్లవర్ ఆయిల్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వంటనూనెల ధరలను నియంత్రించడంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం బియ్యం కార్డు ఆధారంగా రాయితీపై సన్‌ఫ్లవర్ ఆయిల్ అమ్మకాలను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వంటనూనెల అమ్మకాలకోసం పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో 34 ప్రత్యేక కేంద్రాలను జిల్లావ్యాప్తంగా గుర్తించినట్లు చెప్పారు. ఇందులో రైతుబజార్, రిలయన్స్, మోర్, జియోమార్ట్ తదితర మాల్స్‌తోపాటు హోల్‌సేల్, రీటైల్ దుకాణాలు ఉన్నాయన్నారు. వీటిల్లో రాయితీపై లీటరు సన్‌ఫ్లవర్ నూనె రూ.124, పామోలిన్ రూ.110కి అందజేస్తారన్నారు. ప్రత్యేక కేంద్రాల్లో రాయితీ వంటనూనె కావల్సిన వినియోగదారులు విధిగా బియ్యం కార్డు తీసుకెళ్లి, క్యూఆర్ కోడ్ ఆధారంగా ఆన్‌లైన్ సిస్టంలో పొందవచ్చని వివరించారు.

టెట్‌కు 389 మంది హాజరు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు గురువారం 389 మంది హాజరయ్యారు. జిల్లాలోని రెండు సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 460 మంది అభ్యర్థులకుగాను 389 మంది హాజరవగా, 71 మంది గైర్హాజయ్యారు. ఉదయం సెషన్‌లో 230 మందికిగాను 194 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 230 మందికిగాను 195 మంది హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



బైకు హోటల్

టమోటా రైస్, వెజ్ పలావ్, చపాతీ, పులిహోర రైస్, లెమన్ రైస్.. ఇలా స్కూటర్‌కు ప్లకార్డులు కట్టారు. పుట్‌పాత్‌పై స్టాండు పెట్టి ఇంటి నుంచి తీసుకొచ్చిన హాట్‌బాక్సు, గిన్నెలు సర్ది పెట్టారు. ఎండ, వానకు రక్షణకు పెద్ద గొడుగు ఉంచారు. అంతే.. రోడ్‌సైడ్ హోటల్ రెడీ. ఇంటి నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలు అయిపోగానే.. తిరిగి ఇంటికి వెళ్లిపోతారు రేణిగుంటకు చెందిన భరత్‌కుమార్. ఇలా గురువారం తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులో స్కూటర్ హోటల్ కనిపించింది.

- తిరుపతి (కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి

మందు కోసం..

జగన్ ఐదేళ్ల పాలనలో నాణ్యమైన మద్యానికి దూరమయ్యారు మందుబాబులు. ధర ఎక్కువైనా, నాసిరకం 'జే' బ్రాండ్లే దిక్కయ్యాయి. బుధవారం సాయంత్రం ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కాగానే.. తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం బారులు తీరారు. గురువారం కూడా పలు మద్యం షాపుల వద్ద మందుబాబుల సందడి కనిపించింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి





తిరుమల ఆలయంలోకి మహాద్వారం గుండా ప్రవేశించగానే కుడివైపున ఉండే శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలదేవి, చిన్నాదేవి విగ్రహాలు

నేడు శ్రీకృష్ణదేవరాయలు 459వ వర్ధంతి

వెంకన్న వీరభక్తుడు దేవరాయలు



తిరుమల ఆలయం ఉత్తరపు గోడమీద శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1513లో తెలుగులో వేయించిన శాసనం. తిరుమలదేవి, చిన్నాదేవిలు స్వామికి బంగారపు నైవేద్యపు పాత్రలు సమర్పించినట్లు ఇందులో పేర్కొన్నారు.

తిరుమల ఆలయానికి గొప్ప వైభవం రావడంలో విజయనగర రాజుల పాత్ర కీలకమైనది. వీరిలో శ్రీకృష్ణదేవరాయలు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి వీరభక్తుడు. తన 21 ఏళ్ల పాలనా కాలంలో ఆయన ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. అనేక దానాలు చేశారు. స్వామికి విలువైన ఆభరణాలు చేయించి ఇచ్చారు. అందుకే తిరుమల ఆలయంలో ముకుళిత హస్తాలతో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఉంటుంది. ఆయనకు అటూ ఇటూ ఇద్దరు భార్యల విగ్రహాలుంటాయి. ఆయన వెంకన్నకి ఎంత భక్తుడంటే.. భార్యల్లో ఒకరి పేరు తిరుమల దేవి. కూతురికి తిరుమలాంబ అని, కుమారుడికి తిరుమల దేవరాయలు అని ఆయన పేర్లు పెట్టుకున్నారు. చిన్నల్లుడి పేరు కూడా తిరుమల రాయలు కావడం విశేషం. కృష్ణదేవరాయలు వేయించిన శాసనాల ద్వారా తిరుమల వైభవ విశేషాలు అనేక తెలుస్తాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏడుసార్లు తిరుమలకు వచ్చిన కృష్ణదేవరాయలు

- 1513 ఫిబ్రవరి 10వ తేదీన మొదటిసారిగా దేవరాయులు తిరుమలకు వచ్చారు. నవరత్న ఖచిత కిరీటాన్ని స్వామికి సమర్పించారు.
- 1513 మే 2న తిరుమలకు వచ్చిన ఆయన శ్రీవారికి పాలు నైవేద్యంగా సమర్పించటానికి 374 తులాల బంగారు గిన్నె ఇచ్చారు. ఉత్సవమూర్తులకు మూడు బంగారు కిరీటాలు ఇచ్చారు.
- 1513 జూన్ 13న శ్రీవారిని దర్శించుకున్న ఆయన నిత్యసేవల కోసం మాన్యాలు రాసిచ్చారు. నవరత్న ఖచిత ఆభరణాలు సమర్పించారు.
- 1513జూలై 6న స్వామిని దర్శించుకున్న శ్రీకృష్ణ దేవరాయలు 30 వేల బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పలు బంగారు కానుకలను ఇచ్చారు.
- 1515 అక్టోబరు 25న తిరుమలకు వచ్చిన ఆయన మకరతోరణం సమర్పించారు.
- 1517 జనవరి 2న ఆనందనిలయానికి బంగారు పూత పూర్తి అయిన సందర్భంగా కూడా శ్రీకృష్ణ దేవరాయలు తిరుమలకు వచ్చారు.
- 1521 ఫిబ్రవరి 17న తిరుమలకు వచ్చిన ఆయన పీతాంబరంతో పాటు అత్యంత విలువైన వజ్రాలు, ఇతర బంగారు ఆభరణాలు సమర్పించుకున్నారు.

విశేషం

శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన బంగారు పాత్రలూ, ఆభరణాల జాబితా అయితే శాసనాల ఆధారంగా లభించింది కానీ, ఆభరణాలు ఒక్కటి కూడా ప్రస్తుతం లేవు. 1952లో టీటీడీ ఆధ్వర్యంలోకి వచ్చిన ఆభరణాలలో వీటి జాడ లేదు. అప్పటికే మాయమయ్యాయి. కరిగించి కొత్త ఆభరణాలు చేయించి ఉండవచ్చని ఒక ఊహ.

'జల'జలమంటూ..



సదాశివకోన



అమ్మవారికోన

సదాశివకోనలో జలపాత సోయగం

వడమాలపేట మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సదాశివకోన, అమ్మవారి కోనల జలపాతాల సోయగం పర్యాటకులను అలరిస్తోంది. ఇటీవల కురిసన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉధృతంగా నీళ్లు జాలువారుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కనువిందు చేస్తున్న ఉబ్బలమడుగు

వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం కనువిందు చేస్తోంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అడవిలో నుంచి ముందుకు సాగుతున్న ప్రవాహం.. చూపరులను ఆకట్టుకుంటోంది.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి





ఉధృతంగా కైలాసనాథ కోన

నారాయణవనం మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కామాక్షి దేవి సమేత కైలాసనాథ స్వామి కొలువై ఉన్నారు. అక్కడి కైలాసనాథ కోనలో ప్రస్తుతం వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా పడుతోంది. దీంతో భక్తుల రాకపోకలను నిషేధించారు. ప్రకృతి సోయగాల నడుమ, పెద్ద వృక్షాల మధ్య జలపాతం అత్యంత శోభాయామానంగా ఉంది. కొందరు భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలను ఆచరించి అయ్యప్పమాల ధరిస్తున్నారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

సందడి.. సందడిగా

మూడు రోజులుగా తిరుమల కొండల్లో కురిసిన వర్షానికి జలధారలు పరుగులు తీస్తున్నాయి. తిరుపతిలోని కపిలతీర్థంలోకి జలపాతం ఉరుకుతోంది. ఈ నీటి సోయగాలను చూసేందుకు స్థానికులు, భక్తులు గురువారం తరలివచ్చారు. ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి





ఉరుకుతున్న తలకోన

శేషాచలంలోని తలకోన జలపాతాలు ఆహ్లాదం పంచుతున్నాయి. కొండల నుంచి ఉవ్వెత్తున కిందికి ఉరుకుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ దట్టమైన అటవీప్రాంతంలో భారీగా నీరు చేరింది. తలకోన సముద్ర మట్టానికి సుమారు 700 అడుగు ఎత్తున ఉంది. దీంతో ఇక్కడి పర్వత శ్రేణుల శిఖరాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా కిందకు చేరుతున్న తీరు మానసికోల్లాసం కలిగిస్తోంది. భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఇక్కడకు భక్తులను అనుమతించడంలేదు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి





శ్రీవారికి పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో గురువారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన గరుడవాహనమెక్కి దర్శనమిచ్చిన శ్రీవారు పౌర్ణమి సందర్భంగా మరోసారి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర నీరాజనాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడోత్సవం కన్నుల పండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అతిథిగృహం ముందు అక్టోపస్ సిబ్బంది

'పద్మావతి'లో అక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి అక్టోపస్ కమాండోలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. వీరు ప్రతినెలా ఒక్కో ప్రదేశంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి మాక్‌డ్రిల్ చేపట్టారు. వీవీఐపీని ఎవరైనా బంధిస్తే ఎలా రక్షించాలనే అంశంపై ఈ ఆపరేషన్ సాగింది.

ప్రైవేట్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ నోటీసులు జారీచేసినట్లు ఎంఈవో మస్తానయ్య గురువారం తెలిపారు. తుపాన్ కారణంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మూడు రోజులపాటు సెలవుదినం ప్రకటించినప్పటికి ఈ నెల 15వ తేదీన తరగతులు నిర్వహించడం.. తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య, ఎంపీడీవో వేణు పాఠశాలను తనిఖీచేసి డీఈవోకు నివేదికలు పంపారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంకు షోకాజ్‌నోటీసులు జారీ అయినట్లు ఎంఈవో తెలిపారు.

ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా కొన్ని గ్రామాలకు ఆర్టీసీ యాజమాన్యం తాత్కాలికంగా సర్వీసులను నిలిపేసింది. బుధవారం సాయంత్రానికే వర్షం తగ్గిపోవడం, గురువారం ఎండ రావడంతో మధ్యాహ్నం నుంచి అన్ని మార్గాల్లో బస్సుల రాకపోకలను పునరుద్ధరించారు. తిరుపతి- గుడిమల్లం, సూళ్లూరుపేట- కొరిడి, పెర్నాడు, వేనాడు, శ్రీకాళహస్తి- పెరిమిడి, పాలచూరు, సత్యవేడు- శ్రీకాళహస్తి, పాపవినాశనం- తిరుమల, వెంకటగిరి- ఉడమలపాడుకు 25 బస్సులు యథావిధిగా నడుస్తున్నాయి. శ్రీవారిమెట్టు మార్గంలో శుక్రవారం ఉదయం నుంచి నడవనున్నాయి. వర్షాల కారణంగా ఆర్టీసీ రోజు రాబడి సరాసరి రూ.1.7కోట్లు నుంచి బుధవారం రూ.1.3కోట్లకు పడిపోయింది.

మద్యం దుకాణాలు ఇక్కడొద్దు



తిరుపతిలో తరలించాలంటూ ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో మద్యం దుకాణాలు వద్దని, తరలించాలంటూ జిల్లాలోని మూడు చోట్ల స్థానికులు గురువారం ధర్నాకు దిగారు. తిరుపతి నగరం డీబీఆర్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి ఆధ్వర్యంలో స్థానికులు దుకాణం ఎదుట బైఠాయించారు. గుడి, బడి, ఆస్పత్రి, నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బందిలేని చోటకు మార్చకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేతలు వేణుగోపాల్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిమేనిపాడు దళితవాడలో ప్రతిఘటన

ఓజిలి, ఆంధ్రజ్యోతి: ఓజిలి మండలం ఆరిమేనిపాడు దళిత కాలనీ వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ గురువారం దళితులు ప్రతిఘించారు. ఓజిలిలో ఒక షాపు, ఆరిమేనిపాడు దళితకాలనీలో మరో షాపును ఏర్పాటు చేసేందుకు వేలం పాటదారులు సన్నాహాలు చేసుకున్నారు. దీంతో అక్కడి దళిత కాలనీవాసులు షాపు ఏర్పాటును ప్రతిఘటించారు. కాలనీవాసులకు ఇదే దారి కావడంతో మద్యం మత్తులో ఉన్న వారి ఆగడాలు మహిళలకు ఇబ్బందులు కలిగిస్తాయంటూ వాగ్వివాదానికి దిగారు. ఎక్సైజ్ సీఐ అరుణకుమారి గ్రామానికి వెళ్లి అక్కడి దళితులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేనిదే తాముకూడా ఏమీ చేయలేమంటూ తేల్చి చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుంటే సమస్యకు పరిష్కారం ఉంటుందని దళితులకు సూచించారు. ప్రత్యక్ష చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.





ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

చిన్నపాండూరులోనూ మార్చాలంటూ..

వరదయ్యపాలెం, ఆంధ్రజ్యోతి: వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం వారు సత్యవేడు ఎక్సైజ్ సీఐని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని.. పొలాలకు వెళ్లే రైతులు, శ్రీసిటీకి వెళ్లే ఉద్యోగులు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉన్నందున ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బస్సులు, టిప్పర్లు, ఆటోలు వెళుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ మద్యం దుకాణాన్ని మరోచోటకు మార్చాలని వారు కోరారు.

సొంత ఖర్చుతో తెలుగు భాషా సంరక్షణ


లక్షన్నర పుస్తకాలు పంపిణీ చేసిన ఉపాధ్యాయ దంపతులు




పి. తులసినాథం నాయుడు, పుష్ప

పలమనేరు సమీపంలోని సాయినగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయులు పి. తులసినాథం నాయుడు, పుష్ప దంపతులు 2012లో తెలుగు భాషా రక్షణే ధ్యేయంగా తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితిని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి నిర్విరామంగా వేలాది భాషా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో పలువురి మన్ననలు అందుకున్నారు. ముఖ్యంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు భాషా పోటీలు నిర్వహిస్తూ వేలాదిమంది పిల్లలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పుస్తకాలు బహుమతిగా అందజేస్తున్నారు. పిల్లలు పద్యాలు నేర్చుకొంటే విలువలు అలవడుతాయని భావించి 108 పద్యాలు సేకరించి, వాటి భావాలు రాసి చిన్న పుస్తకంలా ముద్రించి పిల్లలకు ఉచితంగా అందించారు. 100 పద్యాలు పిల్లలు సులభంగా నేర్చుకోవడం చూసి దశల వారీగా లక్షా పదివేల నీతి పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. వీటితో పాటు బాల్యాన్ని తీర్చిదిద్దుతాయని భావించి అక్బర్-బీర్బల్ కథలు, తెనాలి రామకృష్ణుడి కథలు, పంచతంత్ర కథలు, హరికిషన్ కథలు, బొమ్మల భారతం, బొమ్మల రామాయణం, బొమ్మల భాగవతం, నాయకుల జీవిత చరిత్రలు, శాస్త్రవేత్తల జీవిత పుస్తకాలు, నజీరుద్దీన్ కథలు, తెలుగువెలుగు, చినబ్బ కథలు, నీతికథల వంటి 30 వేల పుస్తకాలు విద్యార్థులకు వివిధ సందర్భాలలో పంచిపెట్టారు, తెలుగు వారి విజ్ఞాన సర్వస్వంగా భావించే పెద్దబాలశిక్ష పుస్తకాలను 5వేల దాకా పంచిపెట్టారు.పాఠశాలల్లో ప్రార్థనల్లో చెప్పడానికి సూక్తులు, సామెతలు, పద్యాలతో జ్ఞానదీపాల పేరుతో 2వేల పుస్తకాలను ముద్రించి పాఠశాలలకు పంచిపెట్టారు. వీటితో పాటు తులసిఆకులు, తులసిపుష్పాలు, తులసిరసాలు, తెలుగుతోరణంలాంటి 5వేల పుస్తకాలను పంచిపెట్టారు. మొత్తంగా లక్షయాభై వేలకు పైగా పుస్తకాలను పంచిపెట్టి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. మరో యాభైవేల పుస్తకాలను ముద్రించి పంచిపెట్టేందుకు కృషి చేస్తున్నామని తులసినాథం నాయుడు తెలిపారు. తమ సొంత నిధులతో కళామందిరం నిర్మించి భాషా సేవ కొనసాగిస్తుండటం పట్ల పలువురు వారిని ప్రశంసిస్తున్నారు. తమకొచ్చే జీతంలోనే భాషాకార్యక్రమాలకు, పుస్తకాలకు సొమ్ము వెచ్చిస్తున్నారు.


పి.తులసినాథం నాయుడు, పుష్ప దంపతులనుంచి ఉచితంగా పుస్తకాలు అందుకున్న విద్యార్థులు


పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు ఉచితంగా అందజేసిన వివిధ రకాల పుస్తకాలు

- పలమనేరు, ఆంధ్రజ్యోతి


గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి


ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ

ఐరాల(కాణిపాకం), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో గురువారం పున్నమి గరుడసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి పాల్గొన్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు



తవణంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలకరించి, ప్రాకారోత్సవం చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హెల్త్ యూనిట్ భవనాలను వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయండి

- కలెక్టర్ ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో నిర్మిస్తున్న బ్లాక్ లెవల్ హెల్త్ యూనిట్ భవనాలను నవంబరు నెలాఖరులోగా పూర్తిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను, కాంట్రాక్టర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భవన నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. పాలసముద్రం, విజయపురం, బొమ్మసముద్రం, కాణిపాకం, తవణంపల్లె, చౌడేపల్లె, బైరెడ్డిపల్లె, శాంతిపురం మండలాల్లో రూ.50లక్షల చొప్పున బ్లాక్ లెవల్ అదనపు భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ.4 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. మాతాశిశు మరణాల నివారణకు, గర్భిణుల ఆరోగ్య స్థితిగతులు పరిశీలించేందుకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు ఎనిమిది పీహెచ్‌సీలకు చేరాయన్నారు. పీఆర్ ఎస్ఈ శంకర్‌నారాయణ, డీఎంహెచ్‌వో ప్రభావతి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, మెడికల్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జానకి, శిరీష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సర్కారు మద్యం గోడౌన్లకు..

- రికార్డుల ఆధారంగా స్టాకు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు
- దుకాణాల్లోని ఫర్నిచర్, సామగ్రి వేలానికి సిద్ధం

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాకును ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ మద్యాన్ని గోడౌన్లకు పంపుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు డిమాండ్‌కు మించి స్టాకు ఇవ్వడంతో నిల్వలు ఉండిపోయాయి. దీంతో ప్రతి సర్కారు మద్యం దుకాణంలోనూ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు స్టాకు అమ్ముడుపోకుండా ఆగిపోయింది. ప్రభుత్వ మద్యం దుకాణలకు ఈనెల 15తో గడువు ముగిసిపోవడం.. 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల వారీగా ఎంత స్టాకు ఉంది? గోడౌన్ల నుంచి ఎంత స్టాకు తీసుకొచ్చారు? ఎంత మందు విక్రయించారు? అనే వివరాలు సేకరిస్తున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి ఆధ్వర్యంలో దాదాపు ఐదు నుంచి ఆరు టీములు దుకాణాల వారీగా స్టాకును పరిశీలించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని గోడౌన్లకు తరలిస్తున్నారు. గురువారం ఒక్కరోజు దాదాపు 20 శాతం దుకాణాల్లోని స్టాకు రికార్డులు పరిశీలించారు. వీటిల్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫ్రిడ్జిలు, డిజిటల్ మిషన్లు ఇతర పరికరాలు, ఎక్కడైనా సొంత భవనాలుంటే వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిని వేలం వేసి వచ్చిన డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమచేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.36 కోట్లు విలువ చేసే మద్యం స్టాకు ఉంటుందని అధికారుల అంచనా.

ర్యాట్ బైట్ పేరుతో స్వల్ప తేడాలు

తిరుపతి అర్బన్ పరిధిలోని ఒక దుకాణంలో మాత్రం ర్యాట్ బైట్ పేరిట రూ.6500 విలువ చేసే ప్లాస్టిక్ సీసాల మద్యం బాటిళ్ల తేడాలు వున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని సంబంధిత సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ ద్వారా ప్రభుత్వానికి జమచేయిస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మిగిలిన దుకాణాల్లో మాత్రం స్వల్పంగా తేడాలున్నట్లు తెలిపారు. ఒంగోలులో జరిగిన గోల్‌మాల్‌తో మేల్కొన్న ఎక్సైజ్ అధికారులు.. దుకాణాల్లోని ప్రతి స్టాకును క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 10 నుంచి 15 రోజులు పట్టవచ్చని అధికారులు అంటున్నారు.

అదనపు కట్నం కోసం ఎన్ఆర్ఐ వేధింపులు

భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

పుంగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐపై కేసు నమోదు చేసినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు ... పుంగనూరు టౌన్ చంద్రకాంత్‌వీధికి చెందిన విజయశేఖర్ రెడ్డి కుమార్తె విగీతికా రెడ్డికి తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి కుమారుడు ముకుందకుమార్ రెడ్డి(ఎన్ఆర్ఐ)తో 2023 నవంబరు 16వ తేది వివాహమైంది. ముకుందకుమార్‌రెడ్డి అమెరికాలో టెక్సాస్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు.వివాహసమయంలో గీతికారెడ్డికి కట్నంగా రూ.1.50 కోట్లు విలువచేసే బంగారు నగలు, రూ.5లక్షలు నగదు, రూ.10లక్షలు ఆడపడుచు ఖర్చులు, అన్నికలిపి రూ.25లక్షలు వెచ్చించారు. గీతికారెడ్డిని అమెరికాకు తీసుకెళతానని చెప్పిన భర్త తిరుపతిలో సత్యనారాయణ స్వామి వ్రతం చేయించాలని రూ.50 వేలు పుట్టింటినుంచి తేవాలని వేధింపులు మొదలుపెట్టాడు.ఏకైక కుమార్తె కావడంతో పుంగనూరులో ఉన్న ఆస్తులు విక్రయించి తిరుపతిలో వెచ్చిద్దామని గొడవలు చేయడం, డబ్బు తీసుకురాకపోతే అమెరికాకు తీసుకెళ్లనని భార్యను అవమానించాడు. భార్యను అమెరికాకు తీసుకెళ్లకుండా ముకుందకుమార్ రెడ్డి వెళ్లిపోయాడు. పలుమార్లు పంచాయతీలు జరిగినా భర్త కాపురానికి తీసుకెళ్లకుండా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో గీతికారెడ్డి ఫిర్యాదు మేరకు భర్త ముకుందకుమార్‌రెడ్డి, అతడి తండ్రి సుబ్రహ్మణ్యంరెడ్డి, తల్లి శ్యామలమ్మ, అక్క సునీత, బావ సాయినాథరెడ్డిలపై వరకట్నవేధింపుల కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

తపస్సుతోనే రుషిగా మారిన వాల్మీకి: జేసీ


వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి బోయ కులంలో జన్మించి తన తపస్సు వల్ల రుషిగా మారి 23వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించారని జేసీ విద్యాధరి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాత గ్రీవెన్స్ హాలులో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. జిల్లా వెనుకబడిన సంక్షేమాధికారి రబ్బానిబాష, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అమెరికా ప్రమాదంలో మరొకరి మృతి



రాజినేని శివ - సాయితేజారెడ్డి (ఫైల్ ఫొటోలు)

శ్రీకాళహస్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డి చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ మృత్యువాత పడ్డారు. ఈ నలుగురిలో ముగ్గురు శ్రీకాళహస్తి వారే. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతులు, దక్షిణకైలాస్‌నగర్ కాలనీకిచెందిన రాజినేని శివతో పాటు ఓజిలి మండలం రాజుపేటకు చెందిన గోపి వారాంతపు విహార యాత్రకు వెళ్లొస్తుండగా ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతచెందగా, తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డికి తానా సభ్యులు చికిత్స అందించారు. భారతదేశ కాలమానప్రకారం బుధవారం అర్ధరాత్రి సాయితేజా రెడ్డి కూడా మృతి చెందాడు. దీంతో దంపతులు ఇద్దరు మరణించడంతో ఆ కుటుంబంలో మరింత విషాదం అలుముకుంది. మొత్తం నాలుగు మృతదేహాలు ఆదివారం లేదా సోమవారం శ్రీకాళహస్తికి చేరుకుంటాయని బంధువులు భావిస్తున్నారు ఇక రాజినేని శివ మృతదేహాన్ని చూసేందుకు నిరీక్షించలేక వారి తల్లిదండ్రులైన రమేష్‌నాయుడు, శశికుమారి తల్లడిల్లిపోయారు. బుధవారం బెంగళూరు నుంచి బిడ్డ భౌతికకాయాన్ని చూసేందుకు అమెరికా వెళ్లారు.

సాఫ్ట్‌వేర్ పేరుతో మోసం

ఆపై వరకట్న వేధింపులు - భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

పుంగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అంటూ మోసం చేసి పెళ్లి చేసుకుని కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై గురువారం కేసు నమోదు చేసినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. పుంగనూరు మండలం కంగానెల్లూరుకు చెందిన రామకృష్ణ కుమార్తె ఎస్.నందినిని వి.కోట మండలం చెల్దిగానిపల్లెకు చెందిన బీకే. చంద్రశేఖర్ 2022లో వివాహం చేసుకున్నాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అంటూ బెంగళూరులో వేరే పని చేసేవాడు.రెండునెలలు వీరి కాపురం సజావుగా సాగింది.వివాహ సమయంలో కట్నం ఇచ్చినా మళ్లీ అదనపు కట్నం కావాలని చంద్రశేఖర్, వారి కుటుంబీకులు వేధింపులకు గురిచేశారని నందిని ఇచ్చిన ఫిర్యాదుపై భర్త చంద్రశేఖర్, తండ్రి కృష్ణప్ప, తల్లి అమరావతి, తమ్ముళ్లు యుగంధర్, లక్ష్మీపతిలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలానికి చెందిన రామకృష్ణ, అతని కుమార్తెలు రమాదేవి, మీనా కుమారి పిడుగుపాటుకు గురై 2020 మే 30వ తేదీన మృతి చెందారు. దీనిపై అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.4లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షల ఎక్స్‌గ్రేషియాను కుటుంబసభ్యులకు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పంటలను ధ్వంసం చేసిన గజరాజులు


పాతపేట వద్ద వరి పంటను తొక్కేసిన ఏనుగులు

కల్లూరు, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద గురువారం వేకువజామున పంటలను గజరాజులు ధ్వంసం చేశాయి. దీంతో కొబ్బరి, వరి, టమోటా, వంకాయ, బెండ, మల్బరీ పంటలకు అపారనష్టం వాటిల్లింది. పాతపేటలోని రైతు సురేష్‌కు చెందిన 30 కొబ్బరిచెట్లు, డ్రిప్ పైపులు, అర ఎకరా మల్బరీ తోట, రైతు లక్ష్మమ్మకు చెందిన 70 కొబ్బరి చెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేసి పలు కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. రైతు పుష్పలతకు చెందిన అరఎకరా వరి, రైతు వెంకటరత్నంకు చెందిన అరఎకరా వరి, రైతు శ్రీనివాసులుకు చెందిన ఎకరా వరి, రైతు కె. సుబ్రమణ్యంకు చెందిన అర ఎకరా వరి, రైతు శేఖర్‌కు చెందిన అర ఎకరా వరిపంటను ఏనుగులు తొక్కేశాయి. రైతు వై.సుబ్రమణ్యంకు చెందిన అర ఎకరా టమోటా, అర ఎకరా వంకాయ, అర ఎకరా బెండ చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు నందగోపాల్‌కు చెందిన ఎకరా టమోటా, అర ఎకరా వంకాయ పంటకు ఏనుగుల గుంపు నష్టం కలిగించాయి. 16 ఏనుగుల గుంపు మూకుమ్మడిగా పంటలను ధ్వంసం చేసినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. పశ్చిమ అటవీ విభాగం డిప్యూటీ రేంజర్ కుప్పస్వామి, ఎఫ్‌బీఓ శ్రీదేవి ఏనుగుల గుంపు దాడి చేసిన పంటలను పరిశీలించారు. పంటలపై దాడి చేసిన ఏనుగుల గుంపు గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయని, పగలంతా అక్కడే మాటు వేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.


పాతపేట వద్ద టమోటా పంటను తొక్కేసిన ఏనుగులు

కారును అపహరించిన ముఠా అరెస్టు

పరారీలో ఇద్దరు


నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గుడిపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ కారును అపహరించిన ముఠాను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు పరారీలో ఉన్నారు. వివరాలను సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామ్మోహన్‌లతో కలిసి డీఎస్పీ సాయినాథ్ గురువారం గుడిపాల పోలీసు స్టేషన్ ఆవరణలో మీడియాకు తెలిపారు. గతనెల 27వ తేదీన రాత్రి కారులో వస్తున్న వేలూరుకు చెందిన ఆత్మారామ్‌ను గుడిపాల మండల పరిధిలోని కందగిరి కొండ సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకున్నారు. అతడిని బెదిరించి వాహనాన్ని ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టారు. గురువారం కమ్మతిమ్మాపల్లె క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు లగేజీ వ్యానులు అనుమానాస్పదంగా కనిపించడంతో వాటిని ఆపారు. అందులోని ఇద్దరు వ్యక్తులు పరారవగా, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా కారును అపహరించిందని తామేనని చెప్పారు. అలాగే కారులో గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు తెలిపారు. దీంతో రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని, తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన షఫీ(36), జావీద్(26), సాబుద్దీన్(32), రాజేష్‌ఖన్నా(23), ఆసీఫ్ బేగ్(33)లను అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో కారును కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభచూపిన సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ రామ్మోహన్, టెక్నికల్ టీము సభ్యులు దేవరాజులు, రామారావు, రవి, వేణు, గోపి, రుషిలను డీఎస్పీ అభినందించారు.

అభివృద్ధి పనులపై కలెక్టరు సమీక్ష


కలెక్టరుకు రొంపిచెర్ల సమస్యలు చెబుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు అభివృద్ధి పనులపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టరు సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, వర్షాల వల్ల కలిగిన నష్టాల గురించి అడిగారు. బాలుర వసతి గృహం ప్రహరీ పడిపోయిన దృశ్యాలు పరిశీలించి మరమ్మతులకు ఆదేశించారు. గానుగచింత వద్ద నిర్మించిన మల్లెలమిట్ట ప్రాజెక్టు తూమును పరిశీలించారు. తుఫాన్ వర్షాలకు తూము కుంగిపోయిందని, చల్లంపల్లె ప్రాజెక్టు గేట్లు గుర్తుతెలియని వ్యక్తులు పెరికివేశారని కలెక్టరుకు రైతులు తెలిపారు. దీంతో పరిశీలించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. రొంపిచెర్లలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి మండలంలోని పలు సమస్యలు కలెక్టరు దృష్టికితెచ్చారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ మండలంలో 14 చెరువులకు రూ5.3 కోట్లతో బండింగ్ పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు పనులు చేస్తారని, రెండు రోజులకు ఒక్క అంగన్‌వాడీ, సచివాలయాన్ని విజిట్ చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో బాలమురళి, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఎంఈవో శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాటిలేనిది కృష్ణదేవరాయల కీర్తి


శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న బలిజ సంఘ నాయకులు

సదుం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల కీర్తి సాటి లేనిదని సదుం మండల బలిజ సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, నాగరాజ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, సీతారాము, కుమార, రమేశ్, కోదండపాణి, జగదీశ్, శ్రీకాంత్, రమణ, మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సోమల : శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బస్టాండ్‌లో స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, జగదీశ్, సుబ్రమణ్యం, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

కుప్పం : కుప్పంలో కాపు బలిజ కులస్తులు గురువారం శ్రీకృష్ణదేవరాయల జయంతి నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు పి.గోపీనాథ్, మంజునాథ్, బాబు, సోము, చంద్ర, రాజేంద్ర ప్రసాద్, రాజేంద్ర, కృష్ణమూర్తి, సతీశ్ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడండి

సీఎం చంద్రబాబుకు రామచంద్రయాదవ్ లేఖ

పుంగనూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు పక్కన పెట్టి తిరుమల పవిత్రత కాపాడాలని సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ పంపినట్లు బీసీవైపార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల నెయ్యిపై పరిష్కార మార్గాలు సూచిస్తూ పదిరోజుల క్రితం లేఖ రాసినా సీఎం నుంచి స్పందన లేకపోవడంతో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తిరుమల శ్రీవారి దీపం, నైవేద్యం, ప్రసాదాలు వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగినట్లు సీఎం ప్రకటించి భక్తుల మనసు ముక్కలు చేశారని గుర్తు చేశారు. నెయ్యి బయట కొనుగోలు కంటే సొంతంగా తయారు చేయడం అత్యుత్తమ మార్గమని, మీ ప్రభుత్వం సిద్ధమైతే తానే 1000 గోవులు ఇస్తానని, మరో లక్ష గోవులను ఉచితంగా సమకూర్చుతానని తెలియజేసినా స్పందన లేదన్నారు. సీఎం స్పందించకపోతే తిరుమల పరిరక్షణ, పవిత్రత, ప్రక్షాళన కోసం తాను చేస్తున్న పోరాటం ఉధృతం చేసి తదుపరి కార్యాచరణ వెల్లడిస్తానని వివరించారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, అక్టోబర్17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం లో అమ్మ వారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా గురువారం ఆశీర్వద మండపం వద్ద కలశ స్థాపన చేసి, అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచరింప చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమం లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏకాంబరం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

రామకుప్పం : పట్టణంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పౌర్ణమి పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు రాత్రి స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు.

ఇకపై బత్రహళ్లీ వద్ద ఆర్టీసీ బస్సుల స్టాపింగ్

పుంగనూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులు ఇకపై బత్రహళ్లీ వద్ద స్టాపింగ్ ఉంటుందని ఆర్టీసీ డీఎం సుధాకరయ్య తెలిపారు. గురువారం డిపో కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికుల నుంచి మూడు సూచనలు వచ్చాయి. బెంగళూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు బత్రహళ్లీ వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరడంతో వెంటనే స్టాపింగ్ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే పుంగనూరు నుంచి వి.కోటకు ప్రతి రోజు ఉదయం 6గంటలకు ఆర్టీసీ నూతన సర్వీసు నడపాలని, ఉదయం 5గంటలకు సోమల-రాయచోటి నూతన సర్వీసు నడపాలని ప్రయాణికులు సూచించడంతో జిల్లా ప్రజారవాణా అధికారి దృష్టికి తీసుకెళ్లి నూతన బస్సులు రాగానే తగిన చర్యలు తీసుకుంటామని డీఎం వివరించారు.

దేవతామూర్తుల ప్రతిష్ఠాపన



సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) సోమల మండలం నాగిళ్లవారిపల్లెలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం వేద పారాయణం, ప్రధాన కలశ ఆరాధన, ప్రాణప్రతిష్ఠ, కళాహోమం, గణపతి నవగ్రహ హోమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం మహాకుంభాభిషేకం, శిఖర సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు కొల్లా కోటీశ్వరరావు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగం గురువారం ఇరకిపెంట, పొదలకుంటపల్లె పంచాయతీల్లో సిమెంట్ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభించిన పనులను సంక్రాంతి లోగా పూర్తి చేసే విధంగా ప్రణాళిలు రూపొందించామన్నారు. కార్యక్రమాల్లో సర్పంచు రెడ్డెప్ప, ఉప్పలపాటి భానుప్రకాశ్, పార్థసారధినాయుడు, కార్యదర్శి మేనక, సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సోనియా పేర్కొన్నారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని తెలిపారు.

శేషాద్రిస్వామికి ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న శేషాద్రిస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శేషాద్రిస్వామి మూలవర్లకు విశేషాలంకరణచేసి పూజలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనంజయగౌడు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం కోలాటాలు, ఆధ్యాత్మిక భక్తిగీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు.

రేపు కబడ్డీ పోటీలు

చౌడేపల్లె, అక్టోబర్17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు చౌడేపల్లె హైస్కూల్‌లో జరగనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి మార్కులిస్టు, ఇంటర్ స్టడీ సర్టిఫికెట్ తప్పనిసరి తీసుకురావాలని తెలిపారు.

పలమనేరు కుప్పం/పుంగనూరు

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

రొంపిచెర్ల,అక్టోబరు17: (ఆంధ్రజ్యోతి) : రొంపిచెర్ల పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ, పెద్దగొట్టిగల్లు పంచాయతీలో సీసీ రోడ్డు పనులు చేస్తున్నట్లు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ సీసీ రోడ్డుకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరు సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఎంపీడీవో మాధుసూధన్‌రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, టీడీపీ నాయకులు ఇమ్రాన్‌ఖాన్, ఎస్.కరీముల్లా, అంజాద్‌ఖాన్, గూడూరుహరిబాబు, బాబులాల్, రామమూర్తి, చిన్న నాగరాజ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



రామకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంద్యాలమడుగు పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు సోమారెడ్డి, శ్రీనివాసులు గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ, వైస్ఎంపీపీలు ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అటకెక్కిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు



పలమనేరు మండలం టి. ఒడ్డూరు, పెద్దపంజాణి మండలం కెలవాతిలలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు

పలమనేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసి ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అద్దెభవనాల్లో అగచాట్లు పడుతున్నారు. రాజకీయ అండ ఉన్న కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు కాంట్రాక్టు తీసుకొని అర్థాంతరంగా నిలిపివేశారు. భవన నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాసీనంగాను, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. పలమనేరు మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31 సొంత భవనాల్లో వుండగా 38 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాలు, ఉచిత భవనాల్లో ఉంటున్నాయి. గంగవరం మండలంలో మొత్తం 79 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 26 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లోను, మిగిలిన 53 అంగన్‌వాడీకేంద్రాలు ఉచిత భవనాల్లోను, అద్దెభవనాల్లో ఉంటున్నాయి పెద్దపంజాణి మండలంలో మొత్తం 76 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 41 అంగన్‌వాడీకేంద్రాలు సొంత భవనాల్లోను, మిగిలిన 35 అంగన్‌వాడీ కేంద్రాలు ఉచిత భవనాల్లోను, అద్దెభవనాల్లో ఉంటున్నాయి. 2019కి ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన భవనాలే 90శాతం పైగా అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయించేందుకు చొరవ తీసుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పుడైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయించడంతోపాటు, అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా నూతన భవనాలు నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.


గంగవరం మండలం పసుపత్తూరులో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం


కంచర్లకు వినతిపత్రమిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించాలి



బేలుపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు, వాల్మీకి మహర్షి ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకులు

కుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. కుప్పంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, వాల్మీకి సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకుడు ప్రేమ్‌కుమార్ తదితరుల ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కనే గల అసంపూర్తి వాల్మీకి భవనం వద్ద కూడా వేడుకలు చేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంలు మాట్లాడుతూ వాల్మీకుల కోరికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జిమ్ దాము, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన నియోకవర్గ కో ఆర్డినేటర్ నరేశ్‌లతోపాటు వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

రామకుప్పం : మండల పరిధిలోని కెంపసముద్రం, అయ్యప్పగానిపల్లె, కొట్లగూరు, బగలనత్తం, మనీంద్రం, ముద్దనపల్లె తదితర గ్రామాల్లో వాల్మీకి చిత్రపటాలను ఆవిష్కరించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాలను పల్లకీల్లో ఊరేగించారు. ర్యాలీలో వాల్మీకి కుల నేతలు వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, నరసింహులు, సురేష్, మణీంద్రంనాగరాజు, మురళీ, సురేష్, శంకరప్ప, మంజునాథ్, సుబ్రహ్మణ్యం, నాటకంమురళీ, కూటమి నేతలు ఆంజినేయరెడ్డి, ఆనందరెడ్డి, పట్రనారాయణాచారి, విశ్వనాథ్, రామలింగారెడ్డి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు మండలం కొలమాసనపల్లిలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని వైభవంగా నిర్వహించారు. కొలమాసనపల్లి పంచాయతీ గొల్లపల్లి సమీపంలోని ఆరిమాను గంగమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అక్కడినుంచి కొలమాసనపల్లిలో ఉన్న వాల్మీకి మహర్షి గుడివద్ద వరకు కోలాటాలు, డీజే వాయిద్యాలతో వందలాది మంది వాల్మీకులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వాల్మీకి సంఘ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించినప్పటికి మనరాష్ట్రంలో గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలన్నారు. ● వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు పేర్కొన్నారు. గురువారం ఆ కళాశాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తప్పులు చేయడం మానవ సహజమని, ఆ తప్పులను సరిదిద్దుకొని పరివర్తన చెందడమే గొప్ప విషయమని, ఇందుకు వాల్మీకి జీవితమే చక్కని నిదర్శనమన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఇ. వాసు మాట్లాడుతూ వాల్మీకి తన జీవితాన్ని ఒక దొంగగా ప్రారంభించి చివరకు తపస్సు చేసి రత్నాకర్‌గా వున్న పేరు వాల్మీకిగా మార్చుకొన్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బేలుపల్లె గ్రామంలో వాల్మీకి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణగావించి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. వాల్మీకి భజనమందిరం వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించకపోతే పోరాటాలు

● విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు



వాల్మీకికి పూజలు చేస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, చౌడేపల్లెలో వాల్మీకి సంఘు నాయకులు

పుంగనూరు, అక్టోబరు 17(ఆంధ్యజ్యోతి): ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను బీసీలుగా మార్చి అన్యాయం చేశారని, మళ్లీ ఎస్టీలుగా పునరుద్ధరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని రాష్ట్ర వాల్మీకి సంఘ నాయకుడు, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ వాల్మీకులంతా ఐక్యంగా ఉంటూ రాజకీయాలకు అతీతంగా పోరాటం చేసి తమహక్కును సాధించుకోవడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుంగనూరు సీఐ శ్రీనివాసులు, లయన్స్‌క్లబ్ జిల్లా అంబాసిడర్ డాక్టర్ పి.శివ, వాల్మీకి సంఘ, రాజకీయ నాయకులు అద్దాల రమణ, రాజశేఖర్, సత్యనారాయణ, నరసింహులు, రాజాజెట్టి పాల్గొన్నారు. అలాగే పుంగనూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లీలా మాధవిలు వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు.

చౌడేపల్లె : స్థానికఎంపీడీవో కార్యాలయం వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సోమల : సోమల బస్టాండ్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మేకల గంగాధరం, రాజన్న, నక్కా కృష్ణయ్య పాల్గొన్నారు.

సదుం : సదుం వాల్మీకి ఆలయంలో పూజలు, అభిషేకాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మునికృష్ణ, రాజన్న, రామాంజులు, పవన్ కుమార్, చిన్న రమణ, హరీశ్, రవికుమార్, మంజునాథ్, రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ


దుంకుమానుపల్లెలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న గౌనివారి

శాంతిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుమ్మిశి, మొరసనపల్లె, గుంజార్లపల్లె, కడపల్లె, కర్లగట్ట గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయా పంచాయతీల వద్ద మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ తుమ్మిశి పంచాయతీకి రూ.36లక్షలు, గుంజార్లపల్లె పంచాయతీకి రూ.85లక్షలు, మొరసనపల్లె పంచాయతీకి 43లక్షలు, కడపల్లె పంచాయతీకి రూ. 34లక్షలు, కర్లగట్ట పంచాయతీకి 52లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పివి నాగరాజు, విజయరామిరెడ్డి, చలపతి స్వామి, ఆంజనేయరెడ్డి, నారాయణస్వామి, రుద్రప్ప, ఎంపీడీవో కుమార్, ఏపీఎం హరినాథ్, ఈపీఆర్డీ రవినాయక్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లెలో గురువారం ఉపాధిహామీ పథకం ద్వారా గోకులంషెడ్లు, సిమెంటురోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాడిరైతుల సంక్షేమం కోసం మండలానికి 50 చొప్పున గోకులంషెడ్లు మంజూరైతే, సీఎం చంద్రబాబు కుప్పంలోని ప్రతి మండలానికి 500చొప్పున గోకులం షెడ్లను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పీడీ ఏ.రవికుమార్, ఏపీఓ రవికుమార్, టీడీపీ నాయకులు మునస్వామి, పట్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : గంగవరం పంచాయతీలోని డ్రైవర్స్‌కాలనీ, మన్నార్‌నాయనిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు, నాయకులు కలసి భూమి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనందనాయుడు, మురళి, యుగంధర్, రామాంజులు, రఘుపతి పాల్గొన్నారు.

వి.కోట : ముదరందొడ్డి పంచాయతీ గూబలబండ గ్రామంలో రహదారి పనులకు సర్పంచ్ దామోదర్ నేతృత్వంలో భూమిపూజ చేశారు. ముదరం దొడ్డి నుంచి బీటీ రోడ్డు, ఆపై సీసీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు తెలిపారు. అలాగే యాలకల్లు పంచాయతీలో రూ. 9 లక్షల ఉపాధి నిధులతో పనులు చేపటనున్నట్లు వివరించారు.

బాబునగర్‌లో పల్లెపండుగ



కుప్పం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కునత్తం పంచాయతీ బాబునగర్‌లో గురువారం చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో పల్లె పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు సదుం మండల మీట్

సదుం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. పంచాయతీల కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

పుంగనూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి 31వ తేది వరకు పశువుల నట్టల నివారణ మందులు పంపిణీ జరుగుతుందని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మనోహర్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఇంటి వద్దకేవచ్చి మేకలు, గొర్రెలు,పశువులకు మందులు వేస్తామని వివరించారు.

రేపు విద్యుత్ అంతరాయం

శాంతిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) :శాంతిపురం, రామకుప్పం, వి.కోట పరిధిలోని 22 సబ్ స్టేషన్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని రెస్కో డివిజనల్ ఇంజనీర్ హిమ్మత్ సాగర్ తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రైలు ఢీకొని బాలుడి మృతి

కుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణ పరిధిలో గురువారం రైలు ఢీకొని ఒక బాలుడు మృతి చెందాడు. మృతుడు గుడుపల్లె మండలం, కంచిబందార్లపల్లెకు చెందిన ఎ.కిరణ్(17)గా గుర్తించినట్లు రైల్వే హెచ్‌సీ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తల్లికి, కుమారుడికి 27 ఏళ్లే..!

● ప్రభుత్వ పథకాలందక ఇబ్బంది పడుతున్న తూగుండ్రం మహిళ



వరలక్ష్మి, నవీన్‌కుమార్ ఆధార్‌కార్డుల్లో పుట్టిన సంవత్సరం 1997గా నమోదు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం గ్రామానికి చెందిన ఆముదాల బాబుశెట్టి, ఆముదాల వరలక్ష్మి దంపతులకు కుమారుడు నవీన్‌కుమార్(27), కుమార్తె ఎ.కవిత (22) ఉన్నారు. వరలక్ష్మికి సుమారుగా 54 ఏళ్ల వయసు ఉంటుంది. అయితే ఈమె ఆధార్ కార్డు తీసుకునేటప్పుడు అందులో 1997లో పుట్టినట్లు పొరబాటుగా నమోదైంది. దీనివల్ల ప్రస్తుతం ఈమె వయసు 27 సంవత్సరాలుగా ఉంది. దీన్ని సరిదిద్దుకోవడానికి స్కూలు స్టడీ సర్టిఫికెట్ తీసుకెళితే చెల్లదన్నారని, ఒరిజనల్ టీసీ లేదా మార్కుల లిస్టు కావాలంటున్నారని చెప్పింది. అయితే టీసీ, మార్కుల లిస్టు తమ వద్ద లేదని పూతలపట్టులోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారంది. తన వయసు తక్కువగా ఉండటంతో ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నానని, ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని వేడుకుంటోంది.

సర్వజన హితమే సాహితీవేత్తల అభిమతం


వెలుగుపూలు కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరినాయుడు తదితరులు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్వజన హితమే సాహితీవేత్తల అభిమతం అని పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్ అభిప్రాయపడ్డారు. గురువారం కట్టమంచి రైల్వే ఓవర్‌బ్రిడ్జి ఎల్‌జీబీ టవర్స్‌లో ఇదే కళాశాలకు చెందిన తెలుగు లెక్చరర్ రమేష్‌కుమార్ రచించిన వెలుగుపూలు కవితా సంపుటి ఆవిష్కరణ ఘనంగా జరిగింది. చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని హెచ్‌ఎం వెంకటేశులు ఆవిష్కరించారు. పుస్తక సమీక్షను ప్రముఖ రచయిత బి.మునస్వామి చేశారు. వేదిక గౌరవాధ్యక్షుడు హరినాయుడు, గణేశన్, చంద్రశేఖర్,మోహన్‌బెహ్రా పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతిని మార్చేలా ఆరు పాలసీలు

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతిని మార్చేలా ఆరు పాలసీల ప్రకటన ఉందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రకటించిన పారిశ్రామికాభివృద్ధి, ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్, ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ప్రైవేట్ పార్కుల విధానం, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీలతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా దూసుకుపోతున్నారని గురువారం ఒక ప్రకటనలో వివరించారు.

మహాకుంభాభిషేకం

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల దేవాలయంలో గురువారం మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. యాగశాల పూజ, హోమం, మహా పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, ద్రౌపది అమ్మవారిని రథంలో పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు కర్పూర హారతులు పట్టారు.


రథంలో ఊరేగుతున్న ద్రౌపది అమ్మవారు

మా పీహెచ్‌సీని రద్దు చేయకండి

● కలెక్టర్‌కు సిబ్బంది వేడుకోలు


పెనుమూరు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

పెనుమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టర్ సార్.. మా పీహెచ్‌సీని రద్దు చేయకండి' అంటూ పెనుమూరు పీహెచ్‌సీ సిబ్బంది మొరపెట్టుకున్నారు. పెనుమూరుకు సీహెచ్‌సీ మంజూరవడంతో పీహెచ్‌సీని తీసేస్తారని చెబుతున్నారు. ఇందులో భాగంగానే సిబ్బందిని బుధవారం డీసీహెచ్‌ఎస్‌కు సరెండర్ చేశారు. అక్కడకు వెళితే వారికి సిబ్బంది అవసరం లేదని వెనక్కు పంపారని చెప్పారు. దీంతో గురువారం మండలంలోని పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు 46 మంది, ఎంఎల్‌హెచ్‌పీలు 14 మంది, ఏఎన్‌ఎంలు 18 మంది, ఆస్పత్రి సిబ్బంది 12 మంది కలిసి పెనుమూరులోని పీహెచ్‌సీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను దూర ప్రాంతాలకు పంపితే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇచ్చే వేతనం కాస్తా చార్జీలకు సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ మహిళా నాయకురాలి మృతి

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పాతగుంటలో టీడీపీ మహిళా నాయకురాలు జయమ్మ(50) అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ గ్రామానికెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. నాయకులు యతీశ్వర్‌రెడ్డి, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.


జయమ్మ (ఫైల్ ఫొటో)

రీసర్వేలో ఇబ్బందులుంటే పరిష్కరిస్తాం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీసర్వేలో రైతులకు ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం సర్వేయర్లతో సమీక్షించారు. భూమి తగ్గిపోవడం, సర్వే నెంబర్లు, హద్దులు మారిపోవడం, పేర్లు తప్పుగా నమోదవడం, ఒకరి పేరుపై మరొకరి భూమి పేర్కొనడం, తదితర సమస్యలపై ఫిర్యాదులను గ్రామసభల్లో స్వీకరించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సర్వే ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, రీసర్వే డీటీ ఖాదర్, మండల సర్వేయర్ సునీత, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

నేటినుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఈనెలాఖరు వరకు పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన నేపథ్యంలో మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెరువులకు జలకళ


నిండు కుండలా మంగళం చెరువు

విజయపురం, అక్టోబరు 17: వర్షాల కారణంగా మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మొత్తం 42 చెరువుల్లోకి నీరు చేరాయి. గురువారానికి 30 చెరువులైతే నిండుకుండను తలపిస్తున్నాయి. మిగిలిన 12 చెరువుల్లోనూ 50 శాతానికిపైగా నీరు చేరింది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో నలుగురి మృతిపై విచారణ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలై గంగాధర నెల్లూరులోని ఎగవూరుకు చెందిన నాగరాజులురెడ్డి, ఆయన భార్య జయంతి, కుమార్తె సునీత, కుమారుడు దినేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సీఐ లక్ష్మీనారాయణ మూర్రోజుల కిందట దినేష్ స్నేహితులైన ఏడుగురిని విచారించినట్లు సమాచారం. దీనిపై సీఐని సంప్రదించగా విచారణ వాస్తవమేనని చెప్పారు.

నేలకొరిగిన వరి


కాళికాపురంలో నేలకొరిగిన వరిపంట

విజయపురం, అక్టోబరు 17: వర్షాల కారణంగా కాళికాపురం వద్ద నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. ముత్తప్పరెడ్డి కండ్రిగ వద్ద వానల వల్ల పర్మిట్ లేకపోవడంతో రోడ్డుపైనే చెరకు కుళ్లిపోతోందని రైతులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు పాలనలోనే పల్లెకు పండుగ

● ఎమ్మెల్యే భానుప్రకాష్


కోసలనగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, అక్టోబరు 17: సీఎం చంద్రబాబు పాలనలోనే పల్లెకు పండుగ వచ్చిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం కోసలనగరంలో పల్లె పండుగలో భాగంగా రూ.12లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమణప్రకాష్, పీఆర్ ఏఈఈ వీరభద్రం, సీఐ భా"స్కర్", చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు గుణభూషణమ్మ, చిన్నబ్బరాజు, సుధాకర్‌రాజు, బాషా, శ్రీనివాసులు, హరికృష్ణ, సోమశేఖర్, సుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, రాఘవులు, సాములేలు, కపిల్, అశోక్, రవిరాజు, మునిభాస్కర్‌రాజు, ఏకుమలై, నారాయణరాజు, మునికృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా గురువారం జోగివారిపల్లె వద్ద రూ.5లక్షలు, కంపలపల్లెలో రూ.8లక్షలు, గురుకువారిపల్లెలో రూ.5లక్షలు, ఈచనేరిలో రూ.5లక్షలు, కొండ్రాజుకాల్వలో రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, ఎంపీడీవో రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, టి.పుత్తూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, నేతలు అమరేంద్రనాయుడు, మధు, ధనంజయనాయుడు, కుమార్‌నాయుడు పాల్గొన్నారు.


కంపలపల్లెలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

పూతలపట్టు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం గాండ్లపల్లె, వజ్జిరెడ్డిపల్లి, సామనత్తం, ఆకనంబట్టు, ఎర్రచెరువుపల్లి, గొడుగుచింత గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ, శిలాఫలక ఆవిష్కరణ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటరీ అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఇంద్రసేన నాయుడు, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దార్ గుర్రప్ప, పలుశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలకు సిమెంటు రోడ్లతో మహర్దశ

వెదురుకుప్పం, అక్టోబరు 17: గ్రామాలకు సిమెంటు రోడ్ల నిర్మాణంతో మహర్దశ వస్తోందని కార్వేటినగరం టీడీపీ మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నేత పవన్‌కుమార్ అన్నారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో గురువారం జరిగిన 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి నుంచి కొల్లాగుంట కాలనీకి రూ.24లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పౌర్ణమి వేడుకలు

పాలసముద్రం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, ఎస్.భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ

పాలసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ గురువారం కూడా కొనసాగింది. ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

డీపీవో తనిఖీలు


అరగొండ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పార్వతి

తవణంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అరగొండ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పార్వతి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

వేగవంతంగా పారిశుధ్య పనులు

వెదురుకుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను పంచాయతీల్లో వేగవంతం చేయాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. అలాగే కార్వేటినగరం మేజర్ పంచాయతీ జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈవో నాగరత్నమ్మ పాల్గొన్నారు.

లగేజీ ఆటో, బైక్ ఢీ

● ఇద్దరికి గాయాలు

వెదురుకుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లగేజీ ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుపతికి చెందిన ఆకాష్(26), ప్రభాష్(22)లు పచ్చికాపల్లం నుంచి తిరుపతి వైపు బైక్‌లో బయల్దేరారు. రాజబావి కనుమ వద్దకొచ్చేసరికి తిరుపతి నుంచి పచ్చికాపల్లం వస్తున్న లగేజీ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. బాధితులను తిరుపతి ఆస్పత్రికి తరలించారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం



బంగారుపాళ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మాధవనగర్ బ్రహ్మానంద ఆశ్రమ ఆవరణంలో గురువారం ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దాతలు ప్రారంభించారు. బంగారుపాళ్యంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు షణ్ముగం పిళ్లై తన తండ్రి గోవింద పిళ్లై జ్ఞాపకార్థం ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పురాణ, ఆధ్యాత్మిక గ్రంథాలు అందుబాటులో ఉంటాయన్నారు. కరణం సంక్షేమ సంఘ సభ్యులు రవీంద్ర ప్రసాద్, హరి, రవి, శంకర్, జయరామ రెడ్డి తదితరులు ఉన్నారు. ఆశ్రమంలో పౌర్ణమిని పురస్కరించుకుని సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: కమిషనర్

నగరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో వరద బాధిత ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్, అశోక్‌బాబు, సచివాలయ అడ్మిన్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కృష్ణారెడ్డి

పదోన్నతులు కల్పించండి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో పనిచేస్తున్న తమకు పదోన్నతి కల్పించాలని మినిస్ట్రీరియల్ ఉద్యోగులు కోరారు. గురువారం జడ్పీ కార్యాలయంలో సీఈవో రవికుమార్ నాయుడిని కలిసి వినతిపత్రమిచ్చారు. కొన్నేళ్లుగా అటెండర్, జూనియర్, సీనియర్ సహాయకులకు పదోన్నతులు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీలను పరిశీలించి పదోన్నతులు కల్పిస్తామని సీఈవో హామీ ఇచ్చారు.


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

జలమయమైన రోడ్డు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పాలసముద్రం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సరైన నిర్వహణ లేక చిత్తూరు-బలిజకండ్రిగ తారు రోడ్డు గుంతలమయమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరడంతో రోడ్డంతా జలమయమైంది. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


శ్రీకావేరిరాజుపురం వద్ద జలమయమైన రోడ్డు

ఐవీ స్టాండ్ల వితరణ

నగరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరీడ్స్ మానసిక వికలాంగుల పాఠశాల జనరల్ సెక్రటరీ ఆర్.గిరిజ స్థానిక ఏరియా ఆస్పత్రికి ఐవీ స్టాండ్లను వితరణ చేశారు. గురువారం వీటిని ఆర్ఎంవో కార్తీక్ సమక్షంలో ఆస్పత్రికి అందించారు. హెడ్ నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.



వరద బాధితులకు రూ.లక్ష విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న మాన్యం కిషోర్ తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం పాకాల మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు మాన్యం కిషోర్ రూ.లక్ష చెక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం విజయవాడలో అందజేశారు. తనకు ఉన్నంతలో కొంత విరాళంగా అందజేస్తున్నానని కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు.

పేదరిక నిర్మూలన సామాజిక బాధ్యత

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన సామాజిక బాధ్యత అని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల బీఏ విభాగాధిపతి గోపీనాయక్ అన్నారు. గురువారం కళాశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం నిర్వహించారు. అధ్యాపకులు చెన్నకేశవులు, కోటేశ్వరరావు, ఉమాదేవి ప్రసంగించగా, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పగులుతున్నాయ్

● దుకాణాల యజమానుల ఆవేదన

చిత్తూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పూతలపట్టు సమీపంలో ఉన్న యం.బండపల్లె మద్యం డిపోకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. హైవే నుంచి సుమారు అర కిలోమీటరు వరకు మట్టి రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. అలాగే డిపో ఆవరణలోనూ బురదతో నిండిపోయింది. ఈ గుంతల కారణంగా వాహనంలో కుదుపులొచ్చి మద్యంబాటిళ్లు కొన్ని పగిలిపోతున్నాయని దుకాణాల యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



గుంతలు, బురదతో నిండిన మద్యం డిపోకు వెళ్లే దారి

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం


రుద్రాభిషేకంలో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు, తదితరులు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహావీర్ బ్రిడ్జి జీవ కారుణ్య అన్నదాన సమాజం అమృత మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారికి చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈవో తిమ్మారెడ్డి, వేలు పాల్గొన్నారు.

బాలవికాస్ కేంద్రం ప్రారంభం



చిత్తూరు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంతపేట విజయలక్ష్మి కాలనీ గణపతి ఆలయంలో గురువారం సత్యసాయి బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ చిన్నారులకు సంగీతం, క్రీడలు, నాట్యం, చిత్రలేఖనం తదితర అంశాలతోపాటు మానవీయ విలువలను నేర్పించనున్నారు. కాగా, గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బాబాకు పల్లకి పూజలు చేశారు. సత్యసాయి భజనమండలి, సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తోపుడుబండి వితరణ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండిన్య ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఓ వ్యక్తికి తోపుడు బండిని వితరణ చేశారు. రంభా దొరబాబు, ప్రసన్నకుమార్, ఏలుమలై పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ


హేమాద్రి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్కే రోజా

నింద్ర/విజయపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెట్టేరి గ్రామానికి చెందిన వైసీపీ నేత హేమాద్రి తల్లి కృష్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన్ను గురువారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. అలాగే విజయపురం మండలంలోని జగన్నాథపురంలో బాలాజి, మహారాజపురంలో మాజీ ఎంపీటీసీ శివకుమార్, కాళికాపురంలో రమేష్ కుటుంబాలను కూడా పరామర్శించారు.